క్లుప్తంగా

'మూడో విడత ర్యాండమైజేషన్ పూర్తి'

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని పోలింగ్ సిబ్బంది 3వ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ బోర్కడే తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు రాహుల్ మహిపాల్, పోలీసు పరిశీలకులు డీకే చౌదరితో కలిసి పోలింగ్ సిబ్బంది 3వ ర్యాండమైజేషన్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో 599 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, ప్రతీ పోలింగ్ కేంద్రానికి నలుగురు చొప్పున ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇద్దరు ఇతర అధికారులను కేటాయించామన్నారు.

'ఓటరు ప్రలోభాలకు లోను కావద్దు'

లింగాపూర్: ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోను కావొద్దని ఎస్సై కె. ప్రవీణ్ కుమార్ సుచించారు. లింగాపూర్ గాంధీచౌక్ బస్టాండ్ ఆవరణలో మంగళవారం ఓటర్లకు అవగాహన కల్పించారు. మండలంలో 144 సెక్షన్ అమలులో ఉందని, ప్రజలు శాంతియుతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు.

ముగిసిన కాకడహారతి


కాకడహారతికి హాజరైన మహిళలు

ఆసిఫాబాద్: పవిత్ర కార్తీక మాసం పురస్కరించుకొని గత నెల రోజులుగా జిల్లా కేంద్రంలోని శివకేశవ మందిర్, కేశవనాథ మందిరాల్లో ప్రతీరోజు ఉదయం నిర్వహిస్తున్న కాకడ హారతి మంగళవారం ముగిసింది. చివరి రోజు ఆలయాలకు భక్తులు, మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి పూజలు నిర్వహించారు. కేశవనాథ ఆలయంలో అన్నదానం చేపట్టారు.

'మంగళహారతులు' పుస్తకావిష్కరణ


పుస్తకం ఆవిష్కరిస్తున్న ప్రచురణ కర్త

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన పురోహితుడు డిల్లీ విజయ్‌కుమార్ రచించిన మంగళ హారతుల పుస్తకాన్ని మంగళవారం ప్రచురణకర్త, స్థానిక ఫర్టిలైజర్ వ్యాపారి తాటిపెల్లి ఆశిష్ ఆవిష్కరించారు. 94 మంగళ హారతులను ఈ పుస్తకంలో ప్రచురించినట్లు పురోహితులు విజయ్‌కుమార్ తెలిపారు. పుస్తక ప్రచురణకు సహకరించిన దాతకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన ఎన్నికల ప్రచారం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం ముగిసిన వెంటనే పట్టణ పోలీసులు లాడ్జిలలో తనిఖీలు చేపట్టారు. బయట ప్రాంతాల నుంచి వచ్చి కాగజ్‌నగర్‌లో ఉన్న వారు వెంటనే వెళ్లిపోవాలని సూచించారు. ఎన్నికల ప్రచారం చివరిరోజు మంగళవారం కాగజ్‌నగర్‌లోని వివిధ ప్రాంతాల్లో ఉన్న మద్యం షాపులు, బార్లను మూసివేయించారు.

బ్యాంకులో పొదుపు ఖాతా ఉండాలి

ఇంద్రవెల్లి: ప్రతిఒక్కరికీ బ్యాంకులో పొదుపు ఖాతా ఉండాలని నాబార్డు ఎఫ్ఎల్‌సీ లోకరాం రెడ్డి, ఇంద్రవెల్లి ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ మెస్రం కోసేరావ్‌లు అన్నారు. మంగళవారం మండలంలోని సమాక గ్రామంలో బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. పొదుపు ఖాతాలు తెరిచి ప్రధాన మంత్రి జీవన జ్యోతి, సురక్ష భీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి కొత్త రుణాలు పొందాలన్నారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు ఫీల్డ్ అధికారి రంగనాథ్, సర్పంచ్ సోయం రంభాబాయి, గ్రామస్తులు భీంరావ్, పెందోర్ భగవంత్‌రావ్‌పటేల్ పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

చెన్నూర్: ఎన్నికల విధుల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని జైపూర్ ఏసీపీ మోహన్ అన్నారు. పట్టణంలోని హబీబ్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం పోలీసు బలగాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఎన్నికల అధికారులు కేటాయించిన పోలింగ్ బూత్‌లకు బుధవారం బలగాలు తరలివెళ్లాలన్నారు. గురువారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమవుతుందన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు ప్రజలు సెల్‌ఫోన్లతోపాటు ఇతర సామగ్రిని వెంట తీసుకురావద్దని సూచించారు. పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఓటర్లు పోలీసులకు సహకరించాలని కోరారు.

ఆదివాసీల అభివృద్ధికి కృషి చేయాలి

కెరమెరి: ఏళ్లుగా ఆదివాసీలు వెనుకబాటుతనంలోనే ఉన్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఈ ఎన్నికల్లో ఆదివాసీల అభివృద్ధికి కృషి చేసే నాయకులకే తమ మద్దతు ఉంటుందని ఆదివాసీలు పేర్కొంటున్నారు. 'సాక్షి'తో తమ అభిప్రాయాలు పంచుకున్నారు.

జంగ్ తెలంగాణ

చట్టాలు అమలు చేయాలి


రాజ్యాంగంలో ఆదివాసీల రక్షణ కోసం ఎన్నో చట్టాలు ఉన్నాయి. కాని అవి ఎక్కడా అమలు కావడం లేదు. గిరిజన చట్టాలపై అవగాహన ఉన్న నాయకుడు అధికారంలోకి రావాలి.

- సిడాం మానిక్‌రావు, శివగూడ

సౌకర్యాలు కల్పించాలి


అనేక గ్రామాల్లో రోడ్డు రవాణా సౌకర్యాలు లేవు. దీంతో గిరిజనులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కనీసం తాగునీరు కూడా లేని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. సమస్యలు తీర్చే వారికే నా ఓటు.

- ఆత్రం భీంరావు, లైన్‌పటార్

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి


ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో ఉన్నత చదువులు చదివి ఎలాంటి ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నాం.

- కే.జంగు, చౌపన్‌గూడ

ప్రత్యేక పథకాలు తీసుకురావాలి


గిరిజనులు అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక పథకాలు తీసుకురావాలి. ఐటీడీఏ ఉన్నా నప్పటికీ ఎలాంటి ఉపయోగం లేదు. వివిధ పథకాలు అమలు చేసి గిరిజనులను ఆదుకోవాలి.

- మూట ఎల్లయ్య, బాబేఝరి

సమస్యల్లో గిరిజన పాఠశాల

- ఏళ్లుగా అసంపూర్తిగానే భవనం
- కానరాని మౌలిక సదుపాయాలు
- పట్టించుకోని అధికారులు


నిర్మాణ దశలో పాఠశాల భవనం


షెడ్డులో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

తిర్యాణి: గిరిజనుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోంది. అందులో భాగంగా సకల సౌకర్యాలతో నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో గిరిజనుల కోసం ప్రత్యేకంగా గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలు నెలకొల్పింది. కానీ క్షేత్రస్థాయిలో అనేక పాఠశాలల్లో నేటికీ కనీస సదుపాయాలు కల్పించకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

షెడ్డులో బడి.. తప్పని ఇక్కట్లు

మండలంలోని ఉమ్మడి మంగి గ్రామపంచాయతీ పరిధిలోని కుంటుగూడ గ్రామానికి చెందిన విద్యార్థులకు విద్య అందించాలనే ఉద్దేశంతో కుంటగూడ గ్రామంలో గిరిజన సంక్షేమ ప్రాథమికపాఠశాలను నెలకొల్పింది. ఈ పాఠశాలలో మూడో తరగతి వరకు విద్యార్థులకు విద్య బోధన చేస్తున్నారు. కాగా పాఠశాల భవనం నిర్మాణం కోసం దాదాపు 15 ఏళ్ల క్రితం నిధులు మంజూరు కాగా నేటికీ పూర్తికాలేదు. అప్పటి కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యం కారణంగా భవనం పిల్లర్ల దశలోనే అసంపూర్తిగా దర్శనమిస్తుంది. కాగా గత ఏడాది వరకు గ్రామస్తుల ఇళ్లలోనే వంతుల వారీగా పాఠశాలను నిర్వహించగా ఈ ఏడాది ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో పాఠశాలకు కేటాయించిన స్థలానికి దగ్గరలో రేకులషెడ్డు నిర్మాణం చేపట్టారు. షెడ్డుకు చుట్టూ గోడల నిర్మాణం చేపట్టకపోవడంతో తడకలు కట్టి తరగతులు నిర్వహిస్తున్నారు. వానాకాలంలో వర్షం వచ్చిన ప్రతీసారి పాఠశాలలోకి వరద నీళ్లు వస్తుండటంతో విద్యార్థులు విద్యను అభ్యసించేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ఒంటికి రెంటికి సైతం బయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. కాగా పాఠశాల చుట్టూ గోడలు లేకపోవడంతో తడకల రంధ్రాల నుంచి నిత్యం పాఠశాలలోకి పాములు వస్తున్నాయని, ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక విద్యార్థులను బడికి పంపించాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉందని తల్లిదండ్రులు వాపోతున్నారు. దీనికి తోడు పాఠశాలలో మంచినీటి సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

వర్షం వస్తే తడుస్తున్నాం


వర్షానికి వరదనీరు నేరుగా పాఠశాలలోకి వస్తుండటంతో తడుస్తున్నాం. తరచూ పాములు కూడా పాఠశాలలోకి వస్తున్నాయి. వర్షాకాలం బడికి రావాలంటేనే భయపడుతున్నాం. పాఠశాల తనిఖీకి వచ్చిన అధికారులకు ఎన్నోసార్లు చెప్పినం.

- కుర్సెంగ పవిత్ర, విద్యార్థిని

మస్తు కష్టమవుతుంది


పాఠశాలల్లో కనీస వసతులు లేకపోవడంతో మస్తు కష్టమవుతుంది. ఒంటికి, రెంటికి బయటకు వెళ్తున్నాం. బడిలో నీటి సదుపాయం లేకపోవడంతో ఇంటి నుంచే బాటిళ్లలో నీటిని తెచ్చుకుంటున్నాం. ఫ్లోరింగ్ పెచ్చులు ఊడటంతో చాప వేసుకొని కూర్చుంటున్నాం.

- తుంరం శంకర్, విద్యార్థి

కానరాని 'పల్లె వెలుగు'

- తారురోడ్డు ఉన్నా బస్సులు కరువు
- ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకర ప్రయాణం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


ప్రమాదకరంగా వెళ్తున్న ప్రయాణికులు (ఫైల్)

కౌటాల: మండలంలోని పలు పల్లెలకు తారురోడ్డు సౌకర్యం ఉన్నా ఆర్టీసీ బస్సు సేవలు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి మండలంలోని తాటిపల్లి, బండలహెట్టి, గోవర్‌హెట్టి, కన్నెపల్లి, కనికి, నాగేపల్లి గ్రామాలకు వెళ్లేందుకు తారురోడ్డు సౌకర్యం ఉంది. కానీ ఈ మార్గంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆయా గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు ఈ మార్గంలో బస్సు నడపడం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రైవేట్ వాహనాలకు అధిక చార్జీలు చెల్లించి ప్రయాణాలు సాగిస్తున్నారు.

ప్రైవేట్ వాహనాలే దిక్కు

ఆయా గ్రామాలకు బస్సును నడపకపోవడంతో ఆటోల ద్వారా ప్రయాణించే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్రామాల నుంచి మండల కేంద్రానికి, ఇతర గ్రామాలకు వెళ్లేందుకు సమయానికి ఆటోలు రాకపోవడంతో చాలా తిప్పలు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులతో పాటు ఎంతో మంది రైతులు నిత్యం మండల కేంద్రానికి వస్తుంటారు. కానీ ఆర్టీసీ బస్సులు లేక విద్యార్థులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ఆయా విద్యాసంస్థలకు ఆలస్యంగా చేరుకుంటున్నారు. ఆయా గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడిపించాలని అధికారులను పలుమార్లు వేడుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ మార్గంలో ఆర్టీసీ బస్సు సేవలు అందించాలని ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు, రైతులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

మండల కేంద్రం నుంచి ఆయా గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఉన్నా ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నాం. ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకరంగా ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఆర్టీసీ అధికారులు స్పందించి తాటిపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి.

- గణపతి, తాటిపల్లి

బస్సు సౌకర్యం కల్పించాలి

మా గ్రామానికి తారురోడ్డు సౌకర్యం ఉన్నా అధికారులు ఆర్టీసీ బస్సు నడపకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఎన్నోసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదు. మండల కేంద్రానికి, ఆయా గ్రామాలకు వెళ్లేందుకు సమయానికి ఆటోలు రాకపోవడంతో చాలా కష్టాలు పడుతున్నాం.

- రమేశ్, కన్నెపల్లి

'పాల్వాయి కుటుంబానికి అవకాశం ఇవ్వండి'


మాట్లాడుతున్న డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: సేవ దృక్పథం గల పాల్వాయి కుటుంబానికి ఒకసారి అవకాశం ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని సర్‌సిల్క్‌లో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో బీజేపీకి సహకరించాలని కోరారు. బీజేపీ సిర్పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ తప్పనిసరి అన్నారు.

బీఆర్ఎస్ నాయకుల బైక్ ర్యాలీ


ర్యాలీలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈజ్‌గాం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ కాపువాడ, రైల్వే ఓవర్ బ్రిడ్జి, రాజీవ్‌చౌక్ గుండా ఎన్టీఆర్ చౌక్ కోసిని చౌరస్తా వరకు కొనసాగింది. సిర్పూర్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప ప్రత్యేక వాహనంలో ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

లేండిగూడ బడిలో మాక్ పోలింగ్


వేలుకు సిరా పెడుతున్న విద్యార్థి

కెరమెరి: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, లేండిగూడలో మంగళవారం విద్యార్థులతో మాక్ పోలింగ్ నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి, పోలింగ్ సిబ్బందిని నియమించారు. పోటీపడే అభ్యర్థులకు ఎన్నికల గుర్తులు సైతం కేటాయించారు. పాఠశాల హెచ్ఎం ఉప్ప కార్తిక్, టీచర్లు మంద శ్రీకాంత్ ఉన్నారు.


ఓటు వేస్తున్న విద్యార్థిని


ఓటు వేసిన విద్యార్థి


క్యూలో నిల్చున్న విద్యార్థులు

'అధికార పార్టీలను ఓడించండి'

కాగజ్‌నగర్‌టౌన్: బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీ అభ్యర్థులను ఎన్నికల్లో ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పట్టణ కేంద్రంలో మంగళవారం స్థానిక నాయకులతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ చాంద్ పాషా, నాయకులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ గెలుపు ఖాయం'

సిర్పూర్(టి): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రావి శ్రీనివాస్ గెలుపు ఖాయమని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా పార్లమెంటరీ ఇన్‌చార్జి నరేశ్ జాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ షకీల్ నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

గుండిలో కోవ లక్ష్మి ప్రచారం


ప్రచారం చేస్తున్న కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి మంగళవారం మండలంలోని గుండి గ్రామంలో ప్రచారం చేశారు. గుండి వాగుపై వంతెన నిర్మాణం పూర్తికాకపోవడంతో ఎన్నికలను బహిష్కరిస్తూ గ్రామస్తులు గతంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇటీవల బీజేపీ ప్రచార రథం ధ్వంసం కూడా చేశారు. జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు, ఎంపీటీసీ మల్లన్న, సర్పంచ్ అరుణ, రవీందర్, నాయకులు శ్యాంరావు పాల్గొన్నారు.

బాండ్ పేపర్ రాసిన బీజేపీ అభ్యర్థి

కెరమెరి: మండల కేంద్రంతో పాటు సాంగ్వి తదితర గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ప్రచారంలో ఆసిఫాబాద్ బీజేపీ అభ్యర్థి అజ్మీరా ఆత్మారాం నాయక్ హామీలు నెరవేర్చుతానని బాండ్ పేపర్ రాసిచ్చారు.

'సిర్పూర్ రూపురేఖలు మారుస్తా'


ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రవీణ్ కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు సేవకుడిగా ఉండి పేదల కష్టాలు తీర్చుతానని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా. ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారం చివరిరోజు కాగజ్‌నగర్ పట్టణంలో భారీ ఎన్నికల ర్యాలీ నిర్వహించారు. బీఎస్పీని ఓడించేందుకు బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుట్రలు చేస్తున్నాయన్నారు.

పూలే అడుగుజాడల్లో నడవాలి


నివాళులర్పిస్తున్న నాయకులు

కెరమెరి: మండల కేంద్రంలో మంగళవారం మహాత్మ జ్యోతిబా పూలే 133వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పూలే విగ్రహం ఎదుట జెండా ఎగురవేశారు. జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాలి సంఘం మండలాధ్యక్షుడు, సర్పంచ్ కావ్‌డే తుల్సిరాం, ఉపాధ్యక్షుడు శ్యాంరావు, పటేల్ నాగు, నాయకులు సోమ, సుధాకర్, హన్మంతు, శ్రీకాంత్, లక్ష్మణ్, జగన్నాథ్‌రావు, తదితరులు ఉన్నారు.

వాంకిడి: సామాజిక సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిబా పూలే ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్ అన్నారు. మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో అంబేద్కర్ సంఘం, బౌద్ధ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం మహాత్మ జ్యోతిబా పూలే 133వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. జైరాం ఉప్రే, విజేయ్ ఉప్రే, రోషన్, పాండు, విలాస్ ఖోబ్రగడె, సందీప్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతీబాపూలే వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని పూలే విగ్రహానికి మాలి సంక్షేమ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుర్నులె నారాయణ, డివిజన్ అధ్యక్షుడు గుర్నులె మెంగాజీ, మండల అధ్యక్షుడు వడై బాపురావు, నాయకులు సెండె వాసు, బెండారె దివాకర్, ఆదె బాపురావు, కృష్ణ, గౌరయ్య, మారుతి తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: సామాజిక విప్లవ తేజస్సు మహాత్మ జ్యోతిబా పూలే అని మాలి సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్ అన్నారు. మంగళవారం మండలంలోని సాలేగూడ, అప్పపల్లి, జిల్లా కేంద్రంలో పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సంఘం నాయకులు వినోద్, బాపురావు ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు కేశవరావు, నాయకులు మారుతి, తిరుపతి, రుక్మాజీ, సోను, సుధాకర్, అనిల్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: మహాత్మ జ్యోతి బాపూలే ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వర్ధంతి ఘనంగా నిర్వహించారు.

సిర్పూర్(టి): మహాత్మా జ్యోతిబాపూలే వర్ధంతిని మంగళవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల మాలి సంఘం ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పారిశుద్ధ్యంపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వాంకిడి: మండల కేంద్రంలోని ఆశ్రమ బాలికల పాఠశాలలో మండల వైద్యాధికారి ఉప్రే వినయ్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో స్టోర్ రూమ్, వంటగది, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. గదుల్లో దోమల మందు పిచికారీ చేసి డ్రైడే నిర్వహించారు. విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం సోనాపూర్ గ్రామంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పెందూర్ రవిదాస్, హెచ్ఏ భగవాన్ దాస్, బ్రీడింగ్ చెక్కర్ చంద్ర శేఖర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.